

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన బేగంపేట ఫుట్‌పాత్ వ్యాపారులు

ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బేగంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారులకు తాను అండగా ఉంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరోసా ఇచ్చారు. మంగళవారం బేగంపేట డివిజన్‌లోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించాలని ఇటీవల జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు చెప్పడంతో వారు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరంను కలిసి సమస్యను వివరించారు. వారికి అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల నిరసన

యూసుఫ్‌గూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రెసిడెంట్ రోహిన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా బయలుదేరి ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఏసీపీ శ్రీనివాస్

విద్యార్థులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలి

- షాద్‌నగర్ ఏసీపీ శ్రీనివాస్

అమీర్‌పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ చైతన్య ఫీస్ట్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఎర్రగడ్డలోని మెజిస్టిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకలకు షాద్‌నగర్ ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, శ్రద్ధ, నిరంతర సాధన అంశాల ప్రాతిపదికగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు సామజిక బాధ్యత కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఐఐటీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన సుమారు వంద మందికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ జీ.ఆర్ కిరణ్, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం రవికుమార్, డీన్లు నాయుడయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలకు సూచనలు ఇవ్వండి'

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు యూనివర్సిటీ 2023 సంవత్సరానికి ప్రదానం చేసే సాహితీ పురస్కారాల ఎంపికకు పాఠకులు, రచయితల నుంచి సూచనలను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ కోట్ల హన్మంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రక్రియల్లో 2020 జనవరి నుంచి 2022 డిసెంబర్ మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించినవాటిని పరిగణలోకి తీసుకుంటామని, రచయిత మరణించినప్పటికీ వారి రచనలు ఆయా సంవత్సరాల మధ్యకాలంలో ప్రచురణ పొంది ఉంటే సూచించవచ్చని తెలిపారు. కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, గేయ కవిత, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 11 ప్రక్రియల్లో నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చన్నారు. సూచనలలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణకర్త పేరు ఉండాలని, రచయితలు కూడ తమ గ్రంథాలను స్వయంగా సూచించవచ్చన్నారు. కవితా సంపుటులైతే కనీసం 60పేజీలు, మిగతా ప్రక్రియల్లో గ్రంథాలు 96పేజీలకు తగ్గరాదని ఆయన పేర్కొన్నారు. తమ సూచనలను రిజిస్ట్రార్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, నాంపల్లి, హైదరాబాద్-500004 చిరునామాకు జనవరి 20లోపు పంపాలని కోరారు.

కారు పార్కింగ్ విషయంలో ఘర్షణ.. వ్యక్తిపై దాడి

బోరబండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన కారును తీయమన్నందుకు ఇంటి యజమానిపై దాడి చేసిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైట్-2కు చెందిన సలీం ఇంటి ముందు ఎండీ ఖదీర్ అనే వ్యక్తి తన కారును నిలిపాడు. తన ఇంటి ముందు నుంచి కారును సలీం తీయమన్నాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఖదీర్ పక్కనే ఉన్న ఇనుప రాడ్‌తో సలీంపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఖదీర్‌ను అరెస్టు చేశారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ మోహన్‌కుమార్

ఆటో చోరీ దొంగల అరెస్ట్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన ఆటోలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మధురానగర్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్‌రావు, డీఐ రవికుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. శంషాబాద్‌కు చెందిన కె.వెంకటేష్(26) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పాముల రాజు, తుర్పటి శ్రీశైలంతో ఏడాది నుంచి ఆటోలను చోరీ చేసి తక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇప్పటి వరకు మధురానగర్, పంజాగుట్ట, జడ్చర్ల, శంషాబాద్, రాజేంద్రనగర్, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆరు ఆటోలను దొంగిలించారు. మధురానగర్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు చోరీకి గురైన ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

- విద్యుత్ కాంతులతో ధగధగలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న క్రిస్మస్ ట్రీలు, క్రిబ్‌లు
- తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాట్లు



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన ఎర్రగడ్డలోని సెయింట్ థెరిస్సా చర్చి

ఎర్రగడ్డ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు పవిత్రంగా నిర్వహించుకునే క్రిస్మస్ పండుగ వేడుకలకు జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని చర్చిలు సిద్ధమయ్యాయి. అన్ని చర్చిలు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. ఎర్రగడ్డ జాతీయ రహదారిలో గల సెయింట్ థెరిస్సా చర్చిలో శనివారం సాయంత్రం నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్‌లతో ముస్తాబు చేశారు. ఇక్కడ ప్రతి సంవత్సరం ఏర్పాటుచేసే క్రిబ్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఏడాది క్రిబ్స్‌ల సంఖ్య మరింత పెంచి అందంగా తీర్చిదిద్దనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ తదితర ప్రాంతాల్లో గల చర్చిలను క్రిస్మస్ వేడుకల కోసం అందంగా తీర్చిదిద్దారు. నేడు తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు నిర్వహించుకునేందుకు చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



యేసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే క్రిబ్‌లు



బీకేగూడలో క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి

కాఫీ షాప్ ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాఫీ షాప్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లో కొత్తగా ఏర్పాటు చేసిన కాఫీ షాప్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరు యువతులు, ఓ విటుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అక్కడ వ్యభిచారం చేస్తున్నట్టు తేలింది. నిర్వాహకురాలు నిఖిత పరారీలో ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై యువకుల దాడి

బోరబండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఇద్దరు యువకులను బోరబండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం బోరబండ నుంచి చార్మినార్ వైపు వెళ్తున్న సిటీ బస్సు విజేత థియేటర్ సమీపంలోకి రాగానే మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు ఘర్షణ పడుతూ బస్సు ఎక్కడానికి వచ్చారు. డ్రైవర్ బస్సు ఆపడంతో వారు ఒక్కసారిగా డ్రైవర్ కె.కృష్ణ, కండక్టర్ నరేందర్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. కండక్టర్, డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

యాదవ నేతకు మంత్రి పదవి ఇవ్వాలి

- యాదవ హక్కుల పోరాట సమితి డిమాండ్
- ఈ నెల 28న ఇందిరాపార్క్ వద్ద దీక్ష చేస్తామని వెల్లడి



అభివాదం చేస్తున్న యాదవ సంఘాల నాయకులు మేకల రాములు యాదవ్, చక్రధర్ యాదవ్, వంశీమోహన్ యాదవ్ తదితరులు

పంజాగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో 15 శాతం ఉన్న యాదవ సామాజిక వర్గానికి ఒక మంత్రి, 3 ఎమ్మెల్సీ, ఐదు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వాలని యాదవ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28న వేలాదిమందితో ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ యాదవ్, రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు ఎల్లావుల చక్రదర్ యాదవ్, బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు బి.రాంచందర్ యాదవ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో తమ సామాజిక వర్గం ఓట్లతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని రాములు యాదవ్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మంత్రివర్గంలో తమ సామాజిక వర్గానికి స్థానం ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమను విస్మరిస్తోందని ఆరోపించారు. నగరంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని, లక్షలాది మందితో నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం.. నిందితుల అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటోలో వస్తున్న బాలికపై ఓ ఆటో డ్రైవర్ కన్నేశాడు. ఆమెతో ఉన్న యువకుడిని బెదిరించి, తన స్నేహితులతో కలిసి బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురిని బోరబండ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బోరబండ సైట్ 3 ప్రాంతానికి చెందిన బాలిక స్నేహితునితో కలిసి సోమవారం మాదాపూర్ నుంచి ఇంటికి రావడానికి రాత్రి సమయంలో ఆటోలో ఎక్కారు. ఆటో డ్రైవర్ విషయాన్ని తన స్నేహితులకు చెప్పడంతో మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు ఆటో ఎక్కారు. ఇద్దరు డ్రైవర్‌కు చెరో వైపు కూర్చోగా, మరో వ్యక్తి వెనుక కూర్చున్నాడు. బాలిక పక్కన కూర్చొన్న ఆమె స్నేహితుడిని బెదిరించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి యత్నించారు. బాలిక భయంతో కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఏమైందని ఆరా తీయగా ఆమె విషయాన్ని వివరించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

వాంతి వస్తున్నట్లు నటించి ప్రయాణికుడి గొలుసు చోరీ

బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో వాంతి వస్తున్నట్లు ఓ వ్యక్తి నటించగా మరికొందరు హడావుడి చేసి ప్రయాణికుడి మెడలో నుంచి గొలుసు చోరీ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉండే శ్రీకాంత్ దంగేటి మెహదీపట్నం వెళ్లి తిరిగి హాస్టల్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కొద్దిసేపటికి పక్కనే ఉన్న వ్యక్తి వాంతి వచ్చినట్టు నటించడంతో చిరాకు పడిన అతడు వెనుకభాగంలోకి వెళ్లాడు. అక్కడ మరో ముగ్గురు వ్యక్తులు అతని పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో శ్రీకాంత్ జీవీకే మాల్ వద్ద బస్సు దిగి చూసుకుంటే 11 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. అంతా పథకం ప్రకారమే తన గొలుసు చోరీ చేసినట్లు గ్రహించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ ముదిరాజ్

పంజాగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌ను దొడ్డిదారిన నియమించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్, నాయకులు ఎస్.మహేందర్ ముదిరాజ్, బి.సైదులు ముదిరాజ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి నాయకుడిగా ఎదిగిన మెట్టు సాయికుమార్‌ను సీఎం రేవంత్ రెడ్డి సమాఖ్య చైర్మన్‌గా నియమిస్తే ఎమ్మెల్యే లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తొమ్మిది సంవత్సరాలు చైర్మన్‌ను నియమించలేదని, ఎన్నికలకు కేవలం ఏడాది ముందు హడావిడిగా నియమించారని ఆయన విమర్శించారు. నిబంధనలను పాటిస్తూ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద నిజాలు తెలుసుకొని మాట్లాడాలని శ్రీనివాస్ ముదిరాజ్ హితవు పలికారు.

చిత్ర పరిశ్రమ నగరం నుంచి తరలిపోయే ప్రమాదం

- పేరం శివనాగేశ్వరరావుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్పీఐ(ఏ) జాతీయ కార్యదర్శి పి.శివనాగేశ్వరరావు గౌడ్

పంజాగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత కొంత కాలంగా జరుగుతున్న పరిణామాలతో చిత్ర పరిశ్రమ ఇతర ప్రాంతాలకు తరలిపోయే ప్రమాదం ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ)జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావుగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న చిత్ర పరిశ్రమను కాపాడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి మృతి చెందడం, ఆమె కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం విచారకరమని ఆయన అన్నారు. రేవతి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు చిత్రపరిశ్రమపై ఉందన్నారు. ఈ ఘటనను కొందరు స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటూ చిత్రపరిశ్రమను భయాందోళనకు గురిచేస్తున్నట్లు ప్రస్తుత పరిణామాలు కనిపిస్తున్నాయన్నారు. అసెంబ్లీలో సభా నాయకుడైన ముఖ్యమంత్రే ఈ అంశంపై సుదీర్ఘ ప్రసంగం చేయడం విస్మయాన్ని కలిగించిందని.. ఘటనకు కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలన్నారు.

ఆహ్వానం



జేఎల్ఎం సెంట్రల్ చర్చిలో నేడు జరిగే క్రిస్మస్ వేడులకు రావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకురాలు షర్మిలాజాదవ్.. పక్కన ఆ పార్టీ నేత దీపక్‌రెడ్డి

- బోరబండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నం చేస్తున్నారు

- న్యాయవాది పి.శ్రీనివాస్ రెడ్డి

పంజాగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సినిమా పరిశ్రమ లేకపోతే బతకలేమా, ఇక్కడి నుంచి వెళ్లిపోతామంటున్న వారంతా చౌకగా లీజుకు తీసుకున్న భూములను ప్రభుత్వానికి అప్పగించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు సతీష్ కమాల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తాము బయపడినట్టుగానే సంధ్య థియేటర్ వద్ద దుర్ఘటన జరిగిందని, ఆ ఘటనలో రేవతి మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. ఈ ఘటనలో ముద్దాయిగా ఉన్న అల్లు అర్జున్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర బెయిల్ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఆయన బెయిల్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు కేటీఆర్ మద్దతు పలుకుతున్నారని, ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

అయ్యప్పస్వామి పడిపూజలో ఎమ్మెల్యే తలసాని



ఎల్లారెడ్డిగూడలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొంటి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తలసాని సాయికిరణ్, కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్, నవీన్‌యాదవ్, బీజేవైఎం నగర అధ్యక్షుడు సందీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు

- బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

సిల్వర్ జూబ్లీ వేడుకలు



మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఉస్మానియాలో సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకున్నారు. 1999 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులందరూ 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని ఎర్రగడ్డకు చెందిన డాక్టర్ బి.ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. అప్పటి విద్యార్థులంతా ప్రస్తుతం ప్రత్యేక విభాగాలలో నిపుణులుగా ఎంతో మందికి సేవలు అందిస్తున్నారని చెప్పారు.

- ఎర్రగడ్డ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రోడ్లను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మచ్చలేని మహానాయకుడు వాజ్‌పేయి

బౌద్ధనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారి ఆకా రం రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గం చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద బీజేపీ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, పెద్ది రవీందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్లను ఊడ్చి శుభ్రపర్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మచ్చలేని మహానాయకుడు, భారత రాజకీయరంగంలో గొప్ప దేశభక్తి గల నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమంలో కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రభుగుప్తా, శారదామల్లేష్ వెంకటేశ్‌గౌడ్, పోచయ్యయాదవ్, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, శ్రీధర్, హన్మంత్ రామువర్మ పాల్గొన్నారు.



ఆలుగడ్డబావి వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు

బౌద్ధనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ జెండర్లకు హోంగార్డులుగా అవకాశం కల్పించి ట్రాఫిక్ విధుల నిర్వహణలో శిక్షణ ఇప్పించింది. ఇలా శిక్షణ పొందిన వారిని నగరంలోని ఆయా పోలీసు సేషన్లకు కేటాయిస్తోంది. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన వారు మంగళవారం ఉదయం వారు ఆలుగడ్డబావి సర్కిల్ వద్ద విధులు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



గంగపుత్ర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, సంఘం నాయకులు

గంగపుత్ర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

బౌద్ధనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాణికేశ్వరినగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్-2025 ఆవిష్కరణ మంగళవారం సీతాఫల్‌మండిలో జరిగింది. రాష్ట్ర గంగపుత్ర సంఘ నాయకుడు, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని గంగపుత్ర సంఘం నాయకులతో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఠా గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న బీజేపీ నాయకుడు బండ చంద్రారెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ

బౌద్ధనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ మైలార్‌గడ్డలో మంగళవారం అయప్పస్వామి పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ పడిపూజలో బీజేపీ సీనియర్ నాయకుడు బండచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు జలందర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మురళీ భక్త సమాజం అశ్విన్‌గురుస్వామి ఆధ్వర్యంలో భక్తిగీతాలను ఆలపించారు.

ఆంధ్రా ఫిల్మ్ ఇండస్ట్రీ తక్షణమే వైజాగ్‌కు తరలిపోవాలి

● దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్

తార్నాక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 1956 నుంచి తెలంగాణ సినిమా ఇండస్ట్రీని దోపిడీ చేసి లక్షల కోట్ల రూపాయలు సంపాదించిన ఆంధ్రా ఫిల్మ్ ఇండస్ట్రీ తక్షణమే వైజాగ్‌కు తరలిపోవాలని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ అన్నారు. ఆయన మంగళవారం తార్నాకలోని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణకు చెందిన పలువురు డైరెక్టర్లతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలోని కవుల, కళాకారుల, నిర్మాతల, హీరోల, కార్మికుల అవకాశాలను దోపిడీ చేసిన ఆంధ్రా సినిమా ఇండస్ట్రీ, ఇప్పటికైనా ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు వైజాగ్‌కు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డా. కస్తూరి శ్రీనివాస్, తెలంగాణ సినీ మ్యూజిషియన్ యూనియన్ అధ్యక్షుడు రమణ ఓగేటి, చిత్రపురి సాధన సమితి జనరల్ సెక్రటరీ డా.సీహెచ్ భద్ర, మ్యూజిక్ డైరెక్టర్ విష్ణుకుమార్, కేవీస్ రెడ్డి స్టూడియో అధినేత కె. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులందరికీ తాగునీటి సదుపాయం

తిరుమలగిరి డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ శ్రీనగర్ కాలనీ వాసులకు తాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ అన్నారు. మంగళవారం కాలనీలో కంటోన్మెంట్ బోర్డు మంచినీటి విభాగం ఇంజనీర్ శశాంక్‌తో కలిసి పర్యటించారు. మంచినీటి కనెక్షన్ లేని వారికోసం కొత్తగా మంచినీటి పైప్ లైన్ మంజూరైందని త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక ఆధ్వర్యంలో యశ్వంతపూర్ లక్నో ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం అయోధ్య, కాశీ దర్శనానికి వెళ్లేందుకు సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చిన సికింద్రాబాద్ శివాజీనగర్, కుమ్మరిగూడ సెకెండ్‌బజారు తదితర ప్రాంతాలకు చెందిన రామభక్తులు. (సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ - ఆంధ్రజ్యోతి)



సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసిలికా చర్చిలో ప్రార్థనలు



క్రీస్తు జననం వృత్తాంతం



విద్యుత్ వెలుగుల్లో చర్చి

లష్కర్ చర్చిలకు క్రిస్మస్ శోభ

● విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలతో అలంకరణ ● ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

రెజిమెంటల్‌బజార్,డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ వేడుకలకు లష్కర్‌లోని చర్చిలను ముస్తాబు చేశారు. సికింద్రాబాద్ అంటేనే చర్చిలకు నిలయం. ఇక్కడ నివాసం ఉండే క్రైస్తవుల సంఖ్య కూడా అధికమే. దీంతో నగరంలో అన్ని ప్రాంతాలకంటే ఇక్కడ క్రిస్మస్ వాతావరణం ప్రతిబింబిస్తుంది. బుధవారం క్రిస్మస్ పండుగ కావడంతో సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసలికా, సీఎస్ఐ వెస్లీ, మిలీనియం మెథడిస్ట్, సెంటినరీ బాప్టిస్ట్, గుడ్ న్యూస్ చర్చిలను వేడుకలకు విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.


మిలీనియం మెథడిస్ట్ చర్చి



సికింద్రాబాద్ సరోజినిదేవి రోడ్‌లో ఉన్న మిలీనియం మెథడిస్ట్ చర్చిని మిషనరీస్ మెథడిస్ట్ ఎపిస్కోపల్ చర్చి ఆధ్వర్యంలో 1882లో స్థాపించారు.

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో..

పద్మారావునగర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి లోని న్యూబోయగూడలోని సెయింట్ జాన్ మేరియా విన్నీస్ చర్చి, బలరామ్‌నగర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చి, చాచానెహ్రూనగర్‌లోని సియోను ప్రార్థనా మందిరం తదితర ప్రార్థనా మందిరాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



బోయిగూడలోని సెయింట్ జాన్ మారియా విన్నీస్ చర్చి

సెయింట్ మేరీస్ బసిలికా..

సికింద్రాబాద్‌లోని సరోజినిదేవి రోడ్డులో ఉన్న సెయింట్ మేరీస్ చర్చిని బ్రిటిష్ కాలంలో ఆర్మీలోని ఐరిష్ క్యాథలిక్‌ల కోసం ఫాదర్ డేనియల్ మర్ఫీ 1840లో చర్చి నిర్మాణం ప్రారంభించగా 1850లో పూర్తి అయింది. హైదరాబాద్ స్టేట్‌లో అతి పెద్ద చర్చీగా ప్రాచుర్యం పొందిం ది.1886 వరకు క్యాథడల్ చర్చిగా ఉంది. ఈ చర్చి 2008 నవంబర్‌లో బసిలికా గా గుర్తింపు పొందింది. వారసత్వ కట్టడంగా గుర్తించబడింది. ప్రముఖులు సందర్శించడం ఈ చర్చి ప్రత్యేకత



సీఎస్ఐ వెస్లీ చర్చి

సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ఎదురుగా ఉన్న సీఎస్ఐ వెస్లీ చర్చి పురాతనమైనది. ఇంగ్లీష్, తెలుగు, తమిళ భాషల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు. నిర్మాణం పాత యూరోపియన్ మాదిరిగా ఉంటుంది.





సెయింట్ ఆంథోని చర్చి

చిలకలగూడ డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): అతి పురాతనమైన చర్చి మెట్టుగూడలోని సెయింట్ ఆంథోని చర్చి. 1972 వ సంవత్సరంలో 15 తమిళ కుటుంబాలు చేరి మంగళవారం ప్రార్థనలు మొదలు పెట్టారు. నేటికీ నిరంతరాయంగా ఈ ప్రార్థనలు కొనసాగుతున్నాయి. అదే సంవత్సరంలో క్లాట్ పీటర్స్ అనే మహిళ తన నివాసం స్థలాన్ని చర్చికి కేటాయించడంతో శాశ్వత చర్చి భనం నిర్మాణం ప్రారంభం ఏర్పడింది. ఇంగ్లీష్, తమిళ భాషల్లో ప్రార్థనలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత.

సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

సికింద్రాబాద్ క్లాక్‌టవర్ సమీపంలో ఉంది బాప్టిస్ట్ చర్చి. ఇది 1875 సంవత్సరంలో అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీచే స్థాపించబడింది. తరువాత డెక్కన్ అసోసియేషన్ ద్వారా తెలుగు బాప్టిస్ట్ చర్చిల ఆధీనంలోకి వెళ్లింది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మణిపూర్ భాషల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు.



వీఆర్ ఆస్పత్రిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బోయిన్‌పల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలోని వీఆర్ ఆస్పత్రిలో క్రిస్మస్ వేడుకలను, ఆస్పత్రి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఆస్పత్రి డైరెక్టర్ నందకిషోర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి ఆస్పత్రి యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ... తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలందిస్తున్నారంటూ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్, దండుగుల యాదగిరితో పాటు వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న సీఈఓ మధుకర్ నాయక్ ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే

అక్రమ నిర్మాణాలు చేపట్టే వ్యాపారులపై చర్యలు

● సీఈఓ మధుకర్ నాయక్

బోయిన్‌పల్లి, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టే వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ హెచ్చ రించారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని డైమండ్ పాయింట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఇంపీరియల్ గార్డెన్ నుంచి బోయిన్‌పల్లి మార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా బోర్డు ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ క్రమంలో కంటోన్మెంట్ బోర్డుకు ట్రాఫిక్ అధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు మంగళవారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, అదనపు సీపీ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేల పర్యవేక్షణలో కంటోన్మెంట్ బోర్డు పోలీస్‌శాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్తంగా అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సూపరింటెండెంట్ దేవేందర్, కార్ఖాన ఇన్‌స్పెక్టర్ నరేష్, మారేడుపల్లి ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.మధుబాబు తదితరులుపాల్గొన్నారు.

సర్పంచులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

● సుర్వి యాదయ్యగౌడ్

అడ్డగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ముందు సర్పంచులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్పంచులుగా గెలిచిన పాపానికి అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల ఎమ్మెల్యేలు తమ సమస్యలను ప్రస్తావిస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారన్నారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ ఈనెల 27న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పించాలని పిలుపునిచ్చారు. తమకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే ఆ ఎన్నికలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు జి. మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, గణేష్, మల్లయ్య పూర్ణ చందర్‌గౌడ్ పాల్గొన్నారు.



గాంధీ ఆస్పత్రి ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచులు

క్రీడలు దేశ ప్రతిష్టను పెంపొందిస్తాయి

● రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

మారేడుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడలు దేశ గౌరవాన్ని పెంపొందిస్తాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి పురస్కరించుకొని రెండు రోజులపాటు మారేడుపల్లి షెనై క్రీడామైదానంలో సిటీ బీజేవైఎం అధ్యక్షుడు మద్దూరి శివాజి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులను ఉత్సాహపర్చేందుకు లక్ష్మణ్ బ్యాటింగ్ చేశారు. నగరంలోని 41 క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బీజేపీ యూత్ నాయకులు అల్లం శివకుమార్ యాదవ్, టోపీ శంకర్, భానుక మల్లికార్జున్, బీఎస్ శీను, చరణ్, శ్యామ్, ప్రవీణ్, కిషన్, బన్నప్ప, సతీష్, నాగభూషణం రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రతినిధులు

కాంగ్రెస్ సేవాదళ్‌లో పలువురి చేరిక

అడ్డగుట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అడ్డగుట్టవాసులు కాంగ్రెస్ సేవా దళ్‌లో చేరుతున్నారని ఆ పార్టీ సికింద్రాబాద్ సీనియర్ నాయకురాలు రాంలీల తెలిపారు. మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ సేవా దళ్ కార్యాలయంలో అధ్యక్షుడు మిద్దెల జితేందర్, కార్యదర్శి సంగీతల ఆధ్వర్యంలో అడ్డగుట్టకు చెందిన పలువురు సేవాదళ్‌లో చేరారు. కొత్తగా చేరిన వారిని కమిటీలోకి తీసుకున్నారు. కాంగ్రెస్ సేవాదళ్ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శిగా వెంకటరాజం, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలిగా మేరీ, ఉపాధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా పద్మ మహేశ్వరిలకు అవకాశం కల్పించారు.

కిడ్డీ బ్యాంకులు విద్యార్థులకు ఉపయోగకరం

బోయిన్‌పల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుకునే విదార్థులకు కిడ్డీ బ్యాంకుల్లో ఖాతాలను తెరవడం వల్ల డబ్బును వృథా ఖర్చు చేయకుండా ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగపడుతుందని బోయిన్‌పల్లిలోని ఆదర్శ్ బ్యాంకు అదనపు మేనేజర్ పి.వెంకటేశం అన్నారు. బోయిన్‌పల్లిలోని సాయిమోడల్ హైస్కూల్‌లో ఆదర్శ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ బోయిన్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు సేవింగ్ బ్యాంకు ఖాతా కిడ్డీ బ్యాంక్ ద్వారా దాని యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయారెడ్డితో బ్యాంకు మేనేజర్ కె.బ్రహ్మానందం, అదనపు మేనేజర్ పి.వెంకటేశంలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. శ్రావణి, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

కొనుగోలుదారుల హక్కులపై అవగాహన అవసరం

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొనుగోలుదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆర్పీ రోడ్డు నుంచి మోండా మార్కెట్ మీదుగా పాలికాబజార్ వరకు ర్యాలీ నిర్వహించారు.వినియోగదారులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యాక్షులు తాండ రమేష్ ,వల్లాల రవి, శివకుమార్, జనరల్ సెక్రటరీలు నాగేష్,దుర్గాప్రసాద్,రాజు యాదవ్, ఆకుల కవిలత, బండి రజిని, ప్రీతి, సబిత,సంజయ్, పవన్, సంతోష్,అనిల్, ప్రవీణ్, ప్రకాష్, దుర్గాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోండా మార్కెట్‌లో కనీస సదుపాయాలు కరువు

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ

రెజిమెంటల్‌బజార్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో కనీస సదుపాయాలు లేక వ్యాపారులు, కస్టమర్లు అసౌకర్యానికి లోనవుతున్నారని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మంగళవారం ఆమె మోండా మార్కెట్‌లో పర్యటించి వ్యాపారులను మార్కెట్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోయిన్‌పల్లి మార్కెట్ ఏర్పాటుతో మోండా మార్కెట్‌కు ఆదరణ తగ్గి వ్యాపారాలు గతంలో మాదిరిగా సాగడం లేదన్నారు. అదే విధంగా బోయిన్‌పల్లి మార్కెట్‌లో హోల్‌సేల్‌లో విక్రయించాల్సిన కూరగాయలు రిటైల్ కూడా అమ్ముతుండటం వల్ల మోండా మార్కెట్‌లో కొనేవారు తగ్గడం వల్ల కూడా అమ్మకాలు తగ్గిపోతున్నాయన్నారు. మార్కెట్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్ల సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

బొల్లారం రైల్వే స్టేషన్‌లో ఛత్తీస్‌గఢ్ వాసి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బొల్లారం రైల్వే స్టేషన్‌లో ఛత్తీస్‌గఢ్ వాసి అపస్మారక స్థితిలో కింద పడి చనిపోయాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన గిరిష్ కుమార్ (45) కొత్తూర్ గ్రామంలో మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లేందుకు సోమవారం రాత్రి మేడ్చల్ బస్టాండ్ నుంచి నడుచుకుంటూ బొల్లారం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబరు 1కు చేరుకున్నాడు. భోజనం చేసేందుకు చేతిలో డబ్బులు లేకపోవడంతో అక్కడి ప్రయాణికులను యాచిస్తూ ఒక్కసారిగా కింద పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని స్టేషన్ మాస్టర్ గమనించి వైద్యుల్ని పిలిపించి పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

వాంతి వస్తున్నట్లు నటించి ప్రయాణికుడి గొలుసు చోరీ

బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో వాంతి వస్తున్నట్లు ఓ వ్యక్తి నటించగా మరికొందరు హడావుడి చేసి ప్రయాణికుడి మెడలో నుంచి గొలుసు చోరీ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉండే శ్రీకాంత్ దంగేటి మెహదీపట్నం వెళ్లి తిరిగి హాస్టల్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కొద్ది సేపటికి పక్కనే ఉన్న వ్యక్తి వాంతి వచ్చినట్టు నటించడంతో చిరాకు పడిన అతడు వెనుకభాగంలోకి వెళ్లాడు. అక్కడ మరో ముగ్గురు వ్యక్తులు అతని పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో శ్రీకాంత్ జీవీకే మాల్ వద్ద బస్సు దిగాడు. మెడలో చూసుకుంటే 11 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. అంతా పథకం ప్రకారమే తన గొలుసు చోరీ చేసినట్లు గ్రహించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.